ప్రజాశక్తి
ఆదివారం 26 జనవరి 2025 8 పేజీలు
గుంటూరు పల్నాడు




తగ్గిన అపరాల సాగు



రబీలోనూ రైతులకు తప్పని నిరాశ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలో రబీ సీజన్‌లో అపరాల సాగు తగ్గింది. నిర్ధేశిత లక్ష్యం మేరకు కూడా ఈ ఏడాది రబీలో వివిధ రకాల పంటలు సాగవ్వలేదు. గుంటూరు జిల్లాలో 1.84 లక్షల ఎకరాల్లో రబీ సాగవుతుందని అంచనా కాగా ఇప్పటి వరకు 1.42 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. పల్నాడు జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు లక్ష ఎకరాల్లో సాగయ్యాయి.

గుంటూరు జిల్లాలో గత ఆగస్టు 31 నుంచి గత నెల 15 వరకు వరుసగా వచ్చిన తుపాన్లు ప్రభావంతో అధిక వర్షాలు కురిశాయి. దీంతో ఖరీఫ్ పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయి. దిగుబడులు తగ్గాయి. వరి స్థానంలో రెండో పంటగా శనగ, మొక్క.జొన్న, జొన్న, మినుము, పెసర సాగుకు అవకాశాలు ఉన్నా రైతుల్లో నిర్లిప్తత, మద్దతు ధరలు రాకపోవడంతో రెండో పంట సాగుకు ఆసక్తి తగ్గింది. రెండు జిల్లాల పరిధిలో కనీస విస్తీర్ణంలోనే దాదాపు 82 వేల ఎకరాల్లో రబీ సాగవ్వలేదని అధికార వర్గాలు తెలిపాయి. కృష్ణా డెల్టా పరిధిలో వరి స్థానంలో రబీ సాగుకు ఎక్కువ మంది రైతులు జొన్న, మొక్కజొన్న, మినుము, పెసరపై మొగ్గుచూపారు. బోర్ల ద్వారా దాదాపు 2,500 ఎకరాల్లో రబీలో కూడా కొంతమంది రైతులు వరి సాగు చేశారని అధికార వర్గాలు తెలిపాయి.

జొన్న సాగు ఈ ఏడాది 49 వేల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 25 వేల ఎకరాల్లోనే సాగు చేశారు. మొక్కజొన్న 52 వేల ఎకరాలకు గాను 45 వేల ఎకరాల్లో సాగు చేశారు. మినుము, పెసర, శనగ తదితర పంటలు 90 వేల ఎకరాల్లో వేస్తారని అంచనా ఉండగా 70 వేల ఎకరాల్లో సాగు చేశారు. పల్నాడు జిల్లాలో 60 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు కేవలం 29,400 ఎకరాల్లో వరి సాగైంది. 21 వేల ఎకరాల్లో మొక్కజొన్న వేస్తారని భావించగా ఇప్పటి వరకు 24,500 ఎకరాల్లో సాగు చేశారు. 10 వేల ఎకరాల్లో కంది సాగు చేయాల్సి ఉండగా 5800 ఎకరాలు, 30 వేల ఎకరాల్లో శనగ సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 17 వేల ఎకరాల్లో సాగు చేశారు. పొగాకు విస్తీర్ణం 4200 ఎకరాలకు గాను 14 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇతర పంటలు 9 వేల ఎకరాల్లో సాగు చేశారు.

గత ఆగస్టు, సెప్టెంబరులో అధిక వర్షాలతో ముంపు సమస్య ఏర్పడి ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల్లో అపరాలకు సంబంధించి 20 వేల ఎకరాల్లో నష్టం జరిగింది. మునిగిపోయి ఎందుకు పనికిరాకుండా పోయిన మినుము, పెసర, శనగ స్థానంలో మళ్లీ రైతులు కొంత సమయం తరువాత ఇతర పంటలు వేయాలని భావించినా మార్కెట్‌లో ధరల ఆశాజనకంగా లేవని చాలామంది సాగ చేయలేదు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అధిక వర్షాల వల్ల దాదాపు వారం పాటు పొలాల్లో నీరు నిలిచిపోవడం, ఖరీఫ్ పంటలు దెబ్బతినడం, వాటిని తొలగించిన తరువాత భూమిలో ఉన్న తేమ వల్ల జొన్న, మొక్కజొన్న సాగు చేసేందుకు అవకాశం ఉన్నా గతేడాది సరైన ధరలు లేకపోవడంతో రైతులు నిరాశతో ఉన్నారు.



ర్యాలీలో వివిధ సంఘాల శ్రేణులు

రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

గుంటూరులో ప్రజాసంఘాల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం గుంటూరులో రైతు, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక శంకర్ విలాస్ సెంటర్ నుండి కొరిటపాడు మీదుగా గుజ్జనగుండ్ల వరకూ ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు వి.రాధాకృష్ణమూర్తి, సిఐటియు జిల్లా నాయకులు బి.ముత్యాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పాశం రామారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల ఫలితంగా వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి వెళ్లిందని, రైతుల ఆత్మహత్యలు పెరిగాయని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన బిజెపి ఆ తర్వాత వాటిని పట్టించుకోవట్లేద, విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి రైతులపై భారాలు పోపటానికి సిద్ధమైందని విమర్శించారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఢిల్లీలో చారిత్రాత్మక ఉద్యమం చేసిన ఫలితంగా ప్రభుత్వం దిగి వచ్చి వాటిని ఉపసంహరించుకున్నా ఆ తర్వాత కాలంలో దొడ్డిదారిన ఆ చట్టాలను అమలు చేయాలని చూస్తోందని మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల స్థానంలో తెచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేసి, కార్మిక చట్టాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకూ మద్దతు ధర కల్పించాలని, వ్యవసాయ మార్కెట్లను నిర్వీర్యం చేసే నేషనల్ ఫ్రేమ్‌వర్క్ పాలసీని, నేషనల్ కో-ఆపరేటివ్ పాలసీని వెనక్కి తీసుకోవాలని, వ్యవసాయ రంగంలో కార్పొరేట్లు ప్రవేశించే డిజిటల్ అగ్రి మిషన్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టం కిందలో ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ఆదివారం మండల కేంద్రాల్లో జరుగుతున్న నిరసనల్లో రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శులు ఇ.అప్పారావు, బి.శ్రీనివాసరావు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాల్యాద్రి, రైతుసంఘం నాయకులు పి.శివాజీ, కె.రంగారెడ్డి, ఎఐటియుసి నాయకులు బి.హనుమంతరావు, ఎ.అరుణ్ కుమార్, అవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టీ, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలపై మంత్రి లోకేష్ స్పందించాలి

ప్రైవేటు యూనివర్శిటీలను జైళ్లులాగా కాకుండా విద్యాసంస్థలుగా నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - మంగళగిరి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్

అమృత యూనివర్శిటీ విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజధాని అమరావతిలోని ప్రైవేట్ యూనివర్శిటీల్లో వరస ఆత్మహత్యలు జరుగుతున్నాయని, అయితే వీటిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటని ప్రశ్నించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నా ఆత్మహత్యలపై స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రైవేటు యూనివర్శిటీల్లో విద్యార్థులను మానసికంగా ఒత్తిళ్లకు గురిచేయడం, వాటిపై పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఆత్మహత్యలు పెరుగుతున్నాయని చెప్పారు. విద్యార్థులను నిర్బంధించినట్లు జైలు కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారని, అక్కడేం జరుగుతుందనే విషయాలను బయట ప్రపంచానికి తెలియకుండా నిషేధ ప్రదేశాలుగా మార్చారని మండిపడ్డారు. వర్శిటీలను జైళ్ల మాదిరి కాకుండా విద్యనందించే సంస్థలుగా మార్చాలన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అహ్మద్ పఠాన్, సమీర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎ.యశ్వంత్ పాల్గొన్నారు.





గుంటూరు విజేతలకు బహుమతులు అందచేస్తున్న కలెక్టర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి తదితరులు... పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ర్యాలీలో కలెక్టర్ తదితరులు

ప్రలోభాలకు లొంగకుండా ఓటేయాలి

జాతీయ ఓటర్ల దినోత్సవంలో గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు నాగలక్ష్మి, అరుణ్‌బాబు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

డబ్బుకు, ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు వేయడం మన నుండే ప్రారంభమయ్యేట్లు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్బాఆబు అన్నారు. ఓటు ప్రజల చేతిలో ఉన్న ఆయుధమని, రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును ప్రతి ఓటరూ వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని బలపర్చాలని కోరారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శనివారం నిర్వహించారు. గుంటూరులో కలెక్టరేట్ జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.యస్.బి.జి.పార్థసారధి, నగర కమిషనర్ పి.శ్రీనివాసులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రతి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తుందని చెప్పారు 1950 జనవరి 25 న ఎలెక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఏర్పడి ఇప్పటికీ 75 సంవత్సరాలు పూర్తి అయిందన్నారు. 2011వ సంవత్సరం నుండి ప్రతి ఏటా జనవరి 25న ఓటర్ల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. 75 ఏళ్లుగా ఎన్నికల విధానంలో ఎన్నో మార్పులను ఎన్నికల కమిషన్ తెచ్చిందని, చేయి ఎత్తి ఎన్నుకునే విధానం దగ్గర నుండి బ్యాలెట్ పేపర్‌తో ఓటు, ఇవిఎంల ద్వారా ఓటు వేసే వరకూ మార్పులు వచ్చాయని చెప్పారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.యస్.బి.జి.పార్థ సారధి మాట్లాడుతూ ఓటు విలువ తెలుసుకొని ఓటేయాలన్నారు.

అనంతరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు ఓటర్ల ▶ 2లో

నేడు భారత రాజ్యాంగం పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగంపై రూపొందించిన నాలుగు పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను రూపొందించిన ఈ పుస్తకాలను 75వ రిపబ్లిక్‌డే సందర్భంగా ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలో శాసన మండలి చైర్మన్ కె.మోషెన్‌రాజు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు షేక్ మస్తాన్‌వలి పాల్గొని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ఆవిష్కరణ సభకు అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రేపటి నుండి మూడ్రోజులపాటు యానిమేటర్ల నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విఒఎ (యానిమేటర్)ల బకాయి వేతనాల కోసం సోమ, మంగళ, బుధవారాల్లో నరసరావుపేట కలెక్టరేట్ వద్ద చేపట్టే నిరసనలో యానిమేటర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి పిలుపునిచ్చారు. నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు సాధనతోపాటు, వేతనాల పెంపు, కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు, రాజకీయ వేధింపులతో తొలగించిన వారిని కోర్టు తీర్పు ప్రకారం విధుల్లోకి తీసుకోవడం, ఉద్యోగ భద్రత, హెచ్ఆర్ పాలసీ అమల తదితర అంశాలపై ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు డి.శివకుమారి, ఏసమ్మ, టి.రామా రావు, లక్ష్మయ్య, సుధారాణి, రేష్మ, బ్రహ్మం పాల్గొన్నారు.



సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో పల్నాడు జిల్లా విద్యార్థికి 4వ స్థానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పుదుచ్చేరిలోని ఓల్డ్ పోర్ట్ గ్రౌండ్‌లో ఈ నెల 20 నుండి 25వ తేది వరకు నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో దాచేపల్లి జెడ్‌పి పాఠశాల విద్యార్థి పి.దిలీప్ వ్యక్తిగత విభాగంలో 4వ బముమతిని సాధించినట్లు జిల్లా సైన్స్ అధికారి ఎస్.రాజశేఖర్ తెలిపారు. ఈ పోటీల్లో దక్షిణ భారతదేశానికి చెందిన 6 రాష్ట్రాల నుండి 210 ప్రాజెక్టులను ప్రదర్శించగా వ్యక్తిగత విభాగంలో 90 ప్రాజెక్టులు ప్రదర్శించినట్లు తెలిపారు. దిలీప్ ప్రదర్శించిన 'అంబుబ్యాగ్' ప్రాజెక్టు 4వ స్థానంలో నిలిచిందన్నారు. పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ సెల్వం, విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం మెమెంటో, ప్రశంసా పత్రం అందజేసినట్లు తెలిపారు. దిలీప్‌తోపాటు గైడ్ టీచర్ టివిఎల్ ప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డిఇఒ ఎల్.చంద్రకళ, డివైఇఒ యేసుబాబు, హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు అభినందించారు.

గ్లోబల్ పర్స్పెక్టివ్స్ ఆన్ రీసెర్చ్‌లో ఇండో అమెరికన్ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విజయవాడ కెవిఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ గ్లోబల్ పర్స్పెక్టివ్స్ రీసెర్చ్, ఇన్నోవేషన్‌లో తమ కళాశాల ఫార్మసీ చివరి ఏడాది విద్యార్థుల ఆవిష్కరణలకు అద్భుతమైన స్పందన లభించిందని నరసరావుపేట మండలం జొన్నలగడ్డనిలోని చెన్నుపాటి ఇండో అమెరికన్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల సెక్రెటరీ చెన్నుపాటి సత్యనారాయణ శనివారం తెలిపారు. తమ విద్యార్థులు వై.శిరీష, లిఖిత జాతీయ స్థాయిలో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారని చెప్పారు. విద్యతో పాటు అనుబంధ వృత్తి విద్యా పరమైన శిక్షణిస్తున్న నేపథ్యంలో తమ విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెన్నుపాటి వెంకట సురేష్, ఏవో కె.రమేష్ అధ్యాపకులు అభినందించారు.



బహుమతులు అందుకుంటున్న లిఖిత, శిరీష

నేటి ట్రాక్టర్, బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలపై ఆదివారం జరిగే కార్మిక, కర్షక ట్రాక్టర్, బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు కోరారు. ఈ మేరకు శనివారం తాడేపల్లి పట్టణం మేక అమరారెడ్డి భవన్‌లో ప్రజాసంఘాల నాయకులతోకలిసి విలేకర్లతో మాట్లాడారు. కార్మిక, కర్షక జాతీయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు తాడేపల్లి పట్టణం సాయిబాబా గుడి వద్ద నుండి కుంచనపల్లి వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ర్యాలీలో రైతులు, కౌలురైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వరరావు, కె.కరుణాకరరావు, ఆర్‌వి.రాఘవయ్య పాల్గొన్నారు.

నైపుణ్యాలకు విద్యార్థి దశ నుండే పదును పెట్టాలి



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

ప్రజాశక్తి - మేడికొండూరు

నైపుణ్యాలకు విద్యార్థి దశ నుండే పదును పెట్టి విజయం దిశగా రాణించాలని అద్విత స్కిల్ హబ్ సీఈఓ మక్కెన అజయ్ కుమార్ అన్నారు. మండలంలోని పేరేచర్ల యాపిల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి స్పెల్బీ పోటీలు శనివారం జరిగాయి. ప్రథమ బహుమతి జాహ్నవి (ఎస్ఎన్ టాలెంట్ స్కూల్ - మంగళగిరి), ద్వితీయ బహుమతిలో శివ కార్తీక్ (సక్సెస్ స్కూల్ - గుంటూరు), తృతీయ బహుమతికి మణికంఠ (బ్లూబెల్ హైస్కూల్ - అచ్చంపేట) కైవసం చేసుకున్నారు. వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా యాపిల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఇమ్మడి రవికుమార్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఇష్టంతో కష్టపడి చదువుకోవాలని, అన్ని రంగాల్లో పట్టు సంపాదించే వారికి సముచిత స్థానం దొరుకుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఎం.అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపికైన వారితో ప్రిన్సిపల్ కోనూరి రాణి జయకుమార్

రిపబ్లిక్ డే పెరేడ్‌కు 'ఇంటెల్' ఎన్‌సిసి క్యాడెట్లు

ప్రజాశక్తి - మేడికొండూరు

రిపబ్లిక్ డే సందర్భంగా గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించే కవాతకు మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్‌కు చెందిన 20 మంది ఎన్‌సిసి క్యాడెట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కె.రాణి జయకుమార్ తెలిపారు. వీరికి శిక్షణిచ్చిన స్కౌట్ మాస్టర్ షేక్ రన్ హుస్సేన్, హెచ్‌ఎం సుకన్య, కుమారి, స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనీ కెప్టెన్ షేక్ అఫ్రోజ్, స్కౌట్ మాస్టర్ ఖాసింపీరాను స్కూల్ యాజమాన్యం అభినందించింది.

ఎఎన్‌యు డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ కోర్సుల 4వ సెమిస్టర్ విద్యార్థులకు రెగ్యులర్, సప్లమెంటరీలతోపాటు 4వ సెమిస్టర్‌లో వన్‌టైం ఆపర్చునిటీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు సిఇ ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. ఫిబ్రవరి 20వ తేదీలోగా సంబంధిత విద్యార్థులు ఫీజులు చెల్లించాలన్నారు. రూ.100 అపరాద రుసుంతో 24వ తేదీలోగా ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. థియరీ పరీక్షలు మార్చి 25వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని, ఫీజుల వివరాలు, పరీక్షల షెడ్యూల్ www.anu.ac.in వెబ్ సైట్ నుంచి పొందవచ్చునని తెలిపారు.



నేరాలను 15 శాతం తగ్గిస్తాం : ఎస్పీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అన్ని నేరాలను 15 శాతం తగ్గిస్తామని జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ చెప్పారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో ఎక్కువగా పాల్గొంటున్న మొదటి 100 మంది రౌడీ షీటర్లపై చర్యలు తీసుకుంటామని, పెండింగ్లో ఉన్న కేసు పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. పారిపోయిన నేరస్తుల అరెస్టుకు చర్యలు తీసుకుంటామని, అరెస్టు పెండింగ్లో ఉన్న నిందితుల్లో వెంటనే 50 శాతం మందిని అరెస్టు చేస్తామని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను 10 శాతం తగ్గించడం, సైబర్ నేరాలపై వీలైనంత ఎక్కువ అవగాహన కల్పించి 15 శాతం సైబర్ నేరాలను తగ్గించడం, పోగొట్టుకున్న ధనాన్ని రికవరీ చేయడానికి కృషి చేస్తామన్నారు. న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసుల్లో 50 శాతం కంటే ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే దిశగా పని చేస్తామన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పలు కేసులను విచారించి నిందితులకు సత్వరమే శిక్ష పడుటలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యుటర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఉమ్మడి గుంటూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎమ్‌డి.బర్కత్‌ఆలీ, ఎస్పీ సన్మానించారు.

ఈ ఏడాది ఫెడరేషన్ తొలి సమావేశం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

జర్నలిస్టులు సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ అండగా ఉంటుందని ఫెడరేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు కనపర్తి రత్నాకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2025 సంవత్సర తొలి సర్వసభ్య సమావేశం స్థానిక సత్యన్నారాయణ టాకీస్ రోడ్డులోని టాలెంట్ ఎక్స్‌ప్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. తెనాలి నియోజకవర్గ అధ్యక్షులు పి.పున్నయ్య, నాయకులు ఎం.శ్రీకాంత్, ఎ.శ్యామ్‌సాగర్, జహీర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సీనియర్ ఓటర్లకు సన్మానం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని తహసీల్దార్ కరుణకుమార్ ఆధ్వర్యంలో భవనం వెంకటరెడ్డి జెడ్‌పి పాఠశాలలో శనివారం నిర్వహించారు. తొలుత విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో సీనియర్ ఓటర్లను సన్మానించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, బిఎల్‌వోలు పాల్గొన్నారు.

రేపు కెఎస్ లక్ష్మణరావు ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని విజెపి అండ్ డిఎల్‌బి డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ఆత్మీయ సమావేశం జరుగుతుందని ప్రజా సంఘాలు కమిటీలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. సమావేశానికి అన్ని ప్రజాసంఘాల మండల, పట్టణ, జిల్లా బాధ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరాయి.

ప్రలోభాలకు లొంగకుండా ఓటేయాలి

(మొదటి పేజీ తరువాయి)

దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ ఓటర్లను సత్కరించారు. కొత్తగా ఓటరుగా నమోదైన యువతకు ఎపిక్ కార్డులు అందజేశారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్, స్లోగన్స్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్నికల విధుల్లో ప్రతిభకనపరచిన గుంటూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావు, తహశీల్దార్లు వెంకటేశ్వర్లు, నగేష్‌ను సత్కరించారు.

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్‌హాలులో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పి.అరుణ్బఆబు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువకులంతా ఓటు హక్కు పొందాలన్నారు. ఓటు హక్కు ద్వారా సమర్థవంతమైన ప్రభుత్వాలను, ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం ఉంటుందని, తద్వారా ప్రజాస్వామ్య విలువలు కాపాడబడతాయని అన్నారు. పల్నాడు జిల్లాలో 17.30 లక్షల ఓటర్లుండగా నూతనంగా 21095 మంది ఓటు హక్కు పొందారని, వలస వెళ్లినవారు, వృత్తి రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు, అవగాహన లోపంతో నమోదు చేసుకోని వారు మొత్తంగా 50 వేల మంది వరకు ఓటు హక్కు పొందాల్సి ఉందని వివరించారు. ప్రత్యేక ఓటరు నమోదు చేపట్టినప్పుడు వీరంతా ఓటు హక్కు పొందాలని సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి స్వచమైన ఓటరు జాబితా రూపకల్పనకు అందరూ సహకరించాలని కోరారు. కళాశాలల్లో ఓటరు నమోదుపై అవగాహన క్లబ్‌లు ఏర్పాటు చేస్తామని, జిల్లాలోని 7 నియోజకవర్గాలకు ఏడుగురు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులను నియమించామని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లు బొల్లిశెట్టి శివయ్య, నాగేశ్వరరావును కలెక్టర్ సత్కరించారు. నూతనంగా ఓటు హక్కు పొందిన సుమంత్, చందులకు ఎపిక్ కార్డులను అందజేశారు. ట్రాన్స్ జెండార్లు పూర్ణిమా, నక్షత్ర, అనురాధలకు ఓటుహక్కు వినియోగం కోసం చేసిన కృషికిగాను ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఓటు హక్కుపై విద్యార్థులకు బహుముఖ పోటీలు నిర్వహించగా విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రదానం చేశారు. తొలుత నరసరావుపేట పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ నుండి ప్రకాష్ నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ మధులత, మెప్మా అధికారి సిద్ధలింగమూర్తి, మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, తహశీల్దార్ కె.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నేడు కావలిలో ఉపకారవేతనాలు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్‌ప్రివిలేజ్డ్ – గుంటూరు, 'బలిజ కాపు సంక్షేమ సంఘం – కావలి' సంయుక్త ఆధ్వర్యంలో 19వ విద్యా ప్రతిభ పురస్కారాలలో భాగంగా 133 మంది పేద విద్యార్థులకు రూ.4,58 000లు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకారవేతనాల నగదులో రూ.2,24000లు తులసి సీడ్స్ వారు అంద జేస్తున్నారన్నారు. కావలి ఎంఆర్ఒ ఆఫీసు ఎదురుగా ఉన్న లేక్ వ్యూ హోటల్‌లో జరిగే ఈ కార్యక్రమంలో తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరయ్యి ఉపకార వేతనాలు పంపిణీ చేస్తారన్నారు.

కమిషనర్‌పై పోరాటం ఆగదు : డైమండ్ బాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బుడమేరు వరద బాధితులకు ఆహార పానియాల పంపిణీలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని నగర డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్ర బాబు (డైమండ్ బాబు) ఆరోపించారు. గుంటూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 4 వ తేదీ జరిగిన కౌన్సిల్ సమావేశంలో విజయవాడ బుడమేరు కు గుంటూరు నగరపాలక సంస్థ నుండి కేటాయించిన ఫిక్స్‌డ్ డిపాజిట్ నిధులు కేటాయించిన వివరాలు ప్రశ్న రూపంలో అడిగామన్నారు. గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన ప్రజల సొమ్ము రూ.9.23 కోట్లు దుర్వినియోగం చేశారని తెలిపారు. కమిషనర్ ఒక నియంత మాదిరిగా కౌన్సిల్ కి సంబంధం లేకుండా బుడమేరు కి నిధులు డైవర్షన్ చేశారన్నారు. కొన్ని వేల ఫుడ్ ప్యాకెట్స్ గుంటూరు నగర శివారు ప్రాంతమైన చిన్న కోండ్రుపాడు వద్ద పడవేశారని కొంతమంది టిడిపి సానుభూతిపరులు, ఆర్టీసీ డ్రైవర్లు వీడియోలు తీస్తూ ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. వీటికి సంబంధించి నా వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. జిఎంసి నుండి తయారుచేసిన ఆహార పదార్థాలు విజయవాడ వరద బాధితులకు చేరలేదన్నారు. విజయవాడ బుడమేరులో గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులుకు ఒక వార్డు మాత్రమే కేటాయించారని రాష్ట్రవ్యాప్తంగా అనేక రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ఆహార పదార్థాలు తీసుకువచ్చి దానం ఇస్తే గుంటూరు కమిషనర్ ఆర్థిక దోపిడి, ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. టిడిపి నాయకులు, కమిషనర్ అండర్ స్టాండింగ్‌తో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. కమిషనర్ వచ్చిన నాలుగు నెలల కాలంలో నగరపాలక సంస్థకు సంబంధించిన ఫిక్స్ డిపాజిట్ కు సంబంధించి డ్రా చేసిన నిధుల వివరాలు తెలియజేయాలన్నారు. ఏ అధికారి ఖాతాకు ఎంత నిధులు కేటాయించారు స్పష్టంగా తెలియ జేయాలన్నారు. కమిషనర్ రకరకాల మార్గాలలో ఒక నియంత మాదిరిగా ముందుకు వెళ్తున్నారని ప్రతిపక్ష పార్టీ నాయకులతోపాటు, అధికార పార్టీ ముగ్గురు ఎమ్మెల్యే లను,కేంద్ర మంత్రిని కూడా పక్కదారి పట్టిస్తున్నారని తెలిపారు.

తారకరామా నగర్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలోని తారకరామ నగర్ మెయిన్ రోడ్ విస్తరణ పనులు వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ తారకరామ నగర్, ఎస్‌విఎన్ కాలనీ, పెదపలకలూరు రోడ్, తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ తారకరామ నగర్ రోడ్డు విస్తరణ పనుల పురోగతిపై పట్టణ ప్రణాళిక అధికారులను, రోడ్ నిర్మాణ పనులపై ఇంజినీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని మాట్లాడుతూ అవసరం అయితే అదనపు సిబ్బందిని కేటాయించి, విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. విస్తరణ ప్రభావిత భవనాలకు చట్ట ప్రకారం నష్టపరిహారం, స్థలాలకు టిడిఆర్ బాండ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఏసిపి ని ఆదేశించారు. అనంతరం పెద్ద పలకలూరులోని సత్య అపార్ట్మెంట్ ప్రాంతాన్ని పరిశీలించి, స్థానికులతో మాట్లాడి పారిశుధ్య పనులు పూర్తి స్థాయిలో


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్, కార్పొరేటర్లు

చేపట్టాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ని, డ్రైనేజి సమస్య, వీధి దీపాల సమస్యలు పరిష్కారానికి జిఎంసి నుండి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిఈఈని ఆదేశించారు. పెద్ద పలకలూరు చెరువుని పరిశీలించి, చెరువులో నీటి నిల్వకు, సదరు ప్రాంతంలో బోర్‌వెల్ ఏర్పాటు చేసి స్థానిక ప్రాంతాల్లోకి సరఫరా చేయడానికి, చెరువు చుట్టూ జంగిల్ క్లియర్ చేయాలని డిఈఈని ఆదేశించారు. పర్యటనలో డిఈఈ శ్రీనివాస్, ఏసిపి రెహ్మాన్, కార్పొరేటర్లు వి.శ్రీరాంప్రసాద్, బి.స్మితపద్మజ తదితరులు పాల్గొన్నారు.

కాటూరి ఆర్ట్ గ్యాలరీలో వినూత్న ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ప్రపంచ మేధావులలో ఒకరైన బాబాసాహెబ్ విగ్రహాలు, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అలాగే ఆయన ఉపయోగించిన కలం విగ్రహ రూపంలో ఒకచోటే ఉండటం మొదటిసారిగా చూస్తున్నామని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విసి ఆచార్య కె గంగాధరరావు అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రూరల్ గ్రామం కంచర్లపాలెం కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటుచేసిన ఏడు అడుగుల రాజ్యాంగ పుస్తకాన్ని 13 అడుగుల స్టెయిన్లెస్ స్టీల్ కలాన్ని గంగాధరరావు, దళిత విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, ఆచార్య నాగార్జున



విశ్వవిద్యాలయం జియాలజీ ప్రొఫెసర్ ఆచార్య పొన్నెగంటి రత్నాకర్ ఆవిష్కరించారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీలో కొలువుతీరిన విగ్రహాలు కళ్ళకు కట్టినట్లు ఉన్నాయని ప్రొఫెసర్ గంగాధరరావు అన్నారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీలో రూపొందించిన శిల్పాలు జీవం ఉట్టిపడేలా దర్శనమిస్తున్నాయని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా బుద్ధుడు తర్వాత అత్యధికంగా ఉన్న విగ్రహాలు అంబేద్కర్ వేనని గుర్తు చేశారు. స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని కాటూరి వెంకటేశ్వరరావు ఆటోరి శ్రీహర్ష కాటూరి రవిచంద్ర ద్వారా రూపొందించిన భారీ భారత రాజ్యాంగ పుస్తకం, 13 అడుగుల కలం కాటూరి ఆర్ట్ గ్యాలరీలో మైలురాయిగా మిగిలిపోతాయని అన్నారు. కళారంగాన్ని ఎంచుకున్న తమకు ప్రభుత్వ సహాయం లభిస్తే ఆంధ్ర రాష్ట్ర కీర్తిని పతాక స్థాయిలో నిలబెడతామని సూర్య శిల్పశాల వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో తెనాలి సహజకవి అయినాల మల్లేశ్వరరావు, కాటూరి రవిచంద్ర, కాటూరి శ్రీహర్ష, సినీ దర్శకులు కనపర్తి రత్నాకర్ పాల్గొన్నారు.

యోగాసనాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో శనివారం సాయి యోగ విద్యాపీఠం, యోగాచార్యులు బైసు.మల్లికార్జునరావు విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. యోగా ప్రాముఖ్యత గురించి వివరించారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనలలో యోగా, ధ్యానం చేయటం వలన అనేక వ్యాధులు దరిచేరవని అన్నారు. హృద్రోగ సమస్యలు, నరాల సంబంధిత బాధలు, రక్తపోటు, గుండె పనితీరు, మధుమేహం, స్వయం నియంతత్వ నాడీవ్యవస్థ మొదలైన వాటిని నియంత్రణ చేసి వ్యాధిని తగ్గించటంలో ధ్యానం, యోగ ప్రముఖపాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రిన్సిపల్ రామారావు మాట్లాడుతూ విద్యార్థి దశలో ఈ యోగా చేయుట వలన వారిలో సృజనాత్మకత, జ్ఞాపకశక్తి, సొంతగా నిర్ణయం తీసుకునేశక్తి లభిస్తుందని ఎన్నో సందర్భాలలో ఉదాహరణలతో నిరూపితమైందన్నారు. కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధాశ్రమం నిర్వాహకులకు బియ్యం అందజేస్తున్న విద్యార్థులు

ఎల్ఎంహెచ్ స్కూల్ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని లయన్స్ మాంటిస్సోరి హైస్కూల్ (సిబిఎస్ఈ) విద్యార్థులు శనివారం అడుసుమిల్లి గ్రామంలోని శబరి గిరిజన మండలి వృద్ధాశ్రమం వారికి విద్యార్థులు ఇంటి వద్ద నుండి తెచ్చిన తలా గుప్పెడు బియ్యం 1.75 క్వింటాళ్లు పాఠశాలలో ఆశ్రమ నిర్వాహకులు బ్రహ్మయ్యకు అందజేశారు. స్కూలు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ముద్దన నగరాజకుమారి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో సామాజిక స్పృహ, సేవా భావం పెంపొందుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల గౌరవాధ్యక్షులు దాసరి శేషగిరిరావు, ప్రిన్సిపాల్ కిరణ్ జోష్, సిబ్బంది నరేష్, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


చీఫ్ ఇంజినీర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎపిజిఇఎ నాయకులు

ఎన్ఎస్‌పి ఉద్యోగులకు ప్రమోషన్‌లు కల్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ బి.శ్యామ్‌ప్రసాద్‌కు శనివారం అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా మాట్లాడుతూ ఎన్ఎస్‌పి ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు సుమారు 7 సంవత్సరాల నుండి పదోన్నతులు ఇవ్వాల్సి ఉండగా నేటికీ పదోన్నతులు కల్పించలేదన్నారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. చీఫ్ ఇంజినీర్ సానుకూలంగా స్పందించి తప్పనిసరిగా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మురళికష్ణ, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, నగర ఉపాధ్యక్షులు నాగరాజు, బి.శ్రీనివాసరెడ్డి, నగర శాఖ కోశాధికారి శ్రీనివాస్ పెదకోటయ్య తదితరులు పాల్గొన్నారు



పోస్టర్ ఆవిష్కరణలో క్లబ్ బృందం

నేడు సంతాన సాఫల్య కేంద్రం సేవలు

ప్రజాశక్తి - తెనాలి

రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, విజయవాడకు చెందిన నోవా హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచితంగా సంతాన సాఫల్యతపై నిర్వహించే కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ప్రారంభిస్తారని క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఈదరు శ్రీనివాసరావు , డి మురళీకష్ణ చెప్పారు. స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్ లో గల బెస్ట్ డయాగ్నస్టిక్ పైన గల రోటరీ ఆఫీసులో నిర్వహించే కేంద్రంలో సంతాన ప్రాప్తి కి నిపుణులైన డాక్టర్ వై స్వప్న వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన వైద్య సూచనలు ఇస్తారని చెప్పారు. సమావేశంలో కన్నెగంటి మురళీకష్ణ, ఈదర వెంకట పూర్ణ చంద్, చేతన్ రాజ్ కోటారి, కాకుమాను ఉపేంద్ర, ఆలపాటి కిరణ్ చౌదరి, రాజశేఖర్ రెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.



రూ.30 కోట్లు కేటాయించాలని మంత్రికి ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ విన్నపం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విజయవాడలో శనివారం కలిశారు. సత్తెనపల్లి పట్టణాన్ని దీర్ఘకాలంగా వేధిస్తున్న ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా నాలుగు కిలోమీటర్ల మేరకు వరద నీటి కాల్వల నిర్మాణానికి రూ.22 కోట్లు, రఘురాం నగర్, నరసరావుపేట రోడ్డు ప్రాంతాల్లో రెండు పార్కుల అభివృద్ధికి రూ.కోటిన్నర, సత్తెనపల్లి-నరసరావుపేట రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా విస్తరించేందుకు రూ.ఆరున్నర కోట్లు కేటాయించాలని విన్నవించారు.



12వ పిఆర్‌సి కమిషన్‌ను ప్రకటించాలి

ప్రజాశక్తి - వినుకొండ

12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశానికి బి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా రాష్ట్ర కౌన్సిలర్ డివి లింగయ్య మాట్లాడుతూ ఇప్పటికే పిఆర్‌సి ఏర్పాటు 18 నెలలు ఆలస్యమైందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని, 11వ పిఆర్‌సి బకాయి రూ.7384 కోట్లు, డీఏ బకాయిలు రూ.9650 కోట్లు, సిపిఎస్ ఎంప్లాయీస్ బకాయిలు రూ.2500 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కోశాధికారి ఎం.రవిబాబు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సమావేశంలో బి.రాములు నాయక్, కె.శ్రీనివాసరావు, బి.మస్తాన్, బి.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



తహసిల్దార్‌గా వెంకటేశ్వర్లు నాయక్

ప్రజాశక్తి - కారంపూడి

డిప్యూటీ తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు నాయక్ ప్రమోషన్ పొంది నూతన తహశీల్దార్‌గా శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వీఆర్‌ఒలు, కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మాచర్లలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి- మాచర్ల

సోమవారం నుండి 30వ తేది వరకు పట్టణంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం, సుద్దగుంతల కాలనీ, లింగబలిజ కాలనీ సచివాలయాలల్లో ఈ క్యాంపులు ఉంటాయని, పట్టణ ప్రజలు ఆధార్ సంబంధిత సేవలను వినియోగించుకోవాలని కోరారు.



సిపిఎం రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలు నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరుగనున్న నేపథ్యంలో జయప్రదం చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ కార్మికుల, రైతుల, ప్రజా సమస్యలపై పోరాటాలకు వెన్నుదన్నుగా ఉంటూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రైతాంగ వ్యతిరేక విధానాలు, పెట్టుబడిదారీ అనుకూల విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. మతోన్మాద విధానాలను నిలువరిస్తూ రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు సూచనలు చేస్తున్నామన్నారు. మహాసభలో భాగంగా చివరిరోజు బహిరంగ సభ ఉంటుందని, ప్రజలు పెద్దఎత్తున హాజరవ్వాలని కోరారు. సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, ఎంఎ బేబీ, బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ ప్రసంగిస్తారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, నాయకులు కె.రామారావు, సిలార్ మసూద్, రబ్బాని, వెంకటేశ్వరరాజు, ఎ.ప్రసాదరావు, మస్తాన్‌వలి, కుమారి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌కు 13 అర్జీలు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం ప్రతినెలా 4వ శనివారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల నుండి 13 అర్జీలను స్వీకరించిన ఆయన వాటిని ఆయా విభాగాలకు పంపించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కామన్వెల్త్ ట్రేడ్ కౌన్సిల్ చైర్మన్‌గా సాయినాథ్



నియామక పత్రాన్ని అందుకుంటున్న ఎంవి సాయినాథ్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కార్టెల్ టొబాకోస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.వి.సాయినాథ్ ఇండియా కామన్వెల్త్ ట్రేడ్ కౌన్సిల్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పక్కనున్న తన కార్యాలయంలో సాయినాథ్‌ను శనివారం పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పొగాకు పరిశ్రమలో 25 ఏళ్లకు అనుభవం ఉన్న ఆయన నియామకం ఆంధ్రప్రదేశ్ ప్రపంచ వాణిజ్య నెట్‌వర్క్‌లలో, ముఖ్యంగా 56 దేశాలతో కూడిన కామన్వెల్త్‌తో ఏకీకరణకు కొత్త శకాన్ని సూచిస్తుందన్నారు. సాయినాథ్ మాట్లాడుతూ ఇది తనకు, ఆంధ్రప్రదేశ్‌కు ఒక నిర్ణయాత్మక క్షణమన్నారు. కామన్వెల్త్ దేశాలు వాణిజ్య సహకారానికి అసమానమైన అవకాశాలను అందిస్తున్నాయన్నారు. మన రాష్ట్రానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూర్చే స్థిరమైన వాణిజ్య సంబంధాలను పెంపొందించడానికి కృషి చేస్తానన్నారు. సాయినాథ్‌ను అభినందించిన వారిలో ప్రముఖ పారిశ్రామికవేత్త మండలనేని సుబ్బారావు, జనసేన నాయకులు మండలనేని చరణ్ తేజ తదితరులున్నారు.

నేటి కార్మిక, కర్షక వాహన ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అఖిల భారత కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ఆదివారం జరిగే ట్రాక్టర్, బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు పిలుపునిచ్చారు. కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు కేంద్రం పూనుకుందని, 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ 4 లేబర్ కోడ్‌లు తేవడం ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పజెప్పడమో, నిర్వీర్యం చేయడమే అలావాటుగా మారిందని అన్నారు. గ్రామీణ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు తెచ్చిన ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా వాహన ర్యాలీ చేపట్టినట్లు చెప్పారు. ర్యాలీ నరసరావుపేట పట్టణం వినుకొండ రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం వద్ద నుండి స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్క్ వరకు ఉంటుందని చెప్పారు.



రెంటపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగం పీఠిక ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల కార్యదర్శి దుగ్గి అమూల్య అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా రెంటపాళ్ల జెడ్‌పి పాఠశాలలో హెచ్ఎం బసవరాజు రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న అమూల్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై దాడులు జరుగుతున్నాయని, రాజ్యాంగాన్నే మార్చేలా కేంద్రంలో కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. మనువాదాన్ని తెచ్చేందుకు యత్నిస్తున్నారని, అందులో భాగంగానే నూతన విద్యా విధానాన్ని తెచ్చారని, మతపరమైన విషయాలను పాఠ్యాంశాల్లో చేర్చారని చెప్పారు. భగత్‌సింగ్ పాఠ్యాంశాన్ని తొలగించి దేశద్రోహి అయిన సావర్కర్ జీవిత చరిత్రను చేర్చారని విమర్శించారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లో నిర్మితమవుతుందని, ఈ నేపథ్యంలో విద్యా వ్యవస్థను నాశనం చేసేలా ఉన్న నూతన విధానాన్ని రద్దు చేయాలని కోరారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడుకునేందుకు అందరూ నడుంకట్టాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు అను, సాగర్, రక్షిత, భార్గవి, భూలక్ష్మి పాల్గొన్నారు.



ఉత్తమ ఎఇఆర్‌ఒకు సురేష్ నాయక్

ప్రజాశక్తి - వినుకొండ

ఉత్తమ ఎఇఆర్‌ఒగా తహశీల్దార్ సురేష్ నాయక్‌కు పురస్కారాన్ని పొందారు. విజయవాడలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ నుండి పురస్కారాన్ని సురేష్‌నాయక్ అందుకున్నారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీల్లో ఒక్లాండ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విజయవాడలో జరిగిన రంగోత్సవ-2025 రాష్ట్రస్థాయి పోటీల్లో నరసరావుపేట ఒక్లాండ్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచారని పాఠశాల డైరెక్టర్ కె.హనుమంతరావు శనివారం తెలిపారు. పాఠశాలకు చెందిన సుహాజాస్మిన్ 'నినాదం రాయడం'లో ప్రథమ బహుమతి, కె.రుతిక్ డిజిటల్ కోలైజ్ విభాగంలో ద్వితీయస్థానం, జానపద నృత్యాల్లో తృతీయ స్థానం, పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో బహుమతులు సాధించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను డిఇఒ ఎల్.చంద్రకళ అభినందించినట్లు చెప్పారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే ఒత్తిడి లేని విద్యా బోధనకు ఒక్లాండ్ ప్రత్యేకతన్నారు. గతనెలలో జరిగిన పల్నాడు బాలోత్సవం జిల్లాస్థాయి పోటీల్లోనూ బహుమతులు సాధించినట్లు చెప్పారు.

మంత్రి లోకేష్ ఎన్నికల హామీని అమలు చేయాలి

అర్హులకు ఉన్నచోటనే ఇళ్ల పట్టాలు, ఇళ్లస్థలాలు ఇవ్వాలి : సిపిఎం



స్థానికులతో మాట్లాడుతున్న బూరగ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

పేదల నివసిస్తున్న నివాస ప్రాంతాలకు ఉన్నచోటనే పట్టాలు ఇవ్వాలని సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని రామయ్య కాలనీ, విబి బజార్లో సిపిఎం నాయకులతో కలిసి, స్థానికంగా ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బూరుగ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానికంగా పేదల నివాస ప్రాంతాలలో రోడ్లు వేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని, వికలాంగులు, వితంతువులు, అర్హులైన పేదలకు పెన్షన్లు మంజూరు చేయాలని తదితర సమస్యలపై, సోమవారం ఆయా ప్రాంతాల సచివాలయాల వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేస్తున్నామని అన్నారు. సచివాలయాలు వద్ద జరుగు రాయబారం కార్యక్రమంలో ప్రజా సమస్యలను అర్జీల రూపంలో తీసుకొని సచివాలయ అధికారులకు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి పట్టణ సీనియర్ నాయకులు వేముల దుర్గారావు, వేముల వెంకటేశ్వర్లు, ఇర్ఫాన్, వేణు, హసీనా, శారద, ఎస్.కె రహంతాబి, సువార్త, శ్యామల, ఇక్బాల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి : ఎన్నికల సందర్భంగా మంగళగిరి పట్టణంలో మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఇళ్లు వేసుకొని నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు, స్థలంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని, హామీని మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ అన్నారు. మంగళగిరి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పట్టాలు లేని స్థలాల్లో నివాసం ఉటున్న వారికి అభ్యంతరాలు తొలగించి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం మంగళగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మంగళగిరి తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అనంతరం వినతిపత్రం తాసిల్దార్ కు అందజేశారు. ఈ సందర్భంగా జవహర్లాల్ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న అన్ని ప్రాంతాల్లో పేదలకు పట్టాలు ఇచ్చేందుకు అభ్యంతరాలను



మంగళగిరిలో తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తొలగించాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 134 లో ఉంటున్న సుందరయ్య నగర్, శ్రామిక నగర్, భగత్ సింగ్ నగర్ లో 2500 మంది పేదల నివాసం ఉంటున్నారని వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకటవ వార్డ్ నుండి ఏడవ వార్డు వరకు విస్తరించి ఉన్న కొండ ప్రాంతంలోని ఫారెస్ట్ ఏరియాలో అనేక సంవత్సరాల నుండి పేద ప్రజలు ఇల్లు వేసుకొని నివాసముంటున్నారని డిపారె-స్ట్ చేసి పట్టాలు ఇవ్వాలని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు మాట్లాడుతూ పట్టణంలోని మూడో వార్డులో దేవాదాయ భూమిలో ఇల్లు చేసుకొని నివాసముంటున్న 330 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అన్నారు. ఇంకా పట్టణంలో అనేక ప్రాంతాల్లో ఇల్లు చేసుకొని నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని అన్నారు. ఇళ్ల స్థలం లేని 6000 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ, పట్టణ నాయకులు ఎం బాలాజీ, ఎస్ గణేష్, టి శ్రీనివాసరావు, టి శ్రీరాములు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ, సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - పెదకాకాని



బాధిత విద్యార్థిని పరామర్శిస్తున్న నాయకులు

విద్యార్థిని కొట్టిన టీచర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ డిమాండ్ చేశారు. స్థానిక వెంకటకృష్ణ పురం లోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్లో ఐదో తరగతి విద్యార్థిని హోం వర్క్ చేయలేదని సాకుతో విచక్షణారహితంగా టీచర్ దండించిందన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి స్కూల్ టీచర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని నాయకులు తెలిపారు. అర్హత లేని స్కూల్స్ టీచర్ని పెట్టడం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని, బీఈడీ లేని టీచర్ పాఠాలు ఎలా చెప్తారని నాయకులు ప్రశ్నించారు. గతంలో అనేకసార్లు విద్యార్థులను కొట్టారనే విషయాన్ని స్కూలు వద్ద పిల్లల్ని అడిగి తెలుసుకున్నారు. బాధిత విద్యార్థి ఇంటికి వెళ్లి పరామర్శించారు. స్కూలు వద్దకు వచ్చిన ఎంఇఒ ని కలిసిన సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు విచారణ సమగ్రంగా జరపాలని విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు . ప్రైవేట్ పాఠశాలలో అర్హత లేని టీచర్ల వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని విద్యాశాఖ అధికారులు వీటిపై దృష్టి సారించి చట్టాన్ని ప్రతిష్టంగా పాఠశాలల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థిపై విచక్షణారహితంగా కొట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పసిపిల్లలను దగ్గరికి తీసుకొని పాటాలు చెప్పాల్సిన టీచర్స్ ప్రాణాలకు పోయేటట్టు కొట్టటమేంటని ప్రశ్నించారు. ఈ విద్యార్థితోపాటు మరో విద్యార్థిని కూడా ఈ విధంగానే దండించారని, ఇలా పలుమార్లు జరగడంతో తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి కే యశ్వంత్ సిఐటియు నాయకులు రాజా రమేష్ పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలోకి ఇద్దరు కార్పొరేటర్లు

పెమ్మసాని ఆధ్వర్యంలో కొనసాగుతున్న చేరికలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థలో వైసిపి బలం క్రమంగా తగ్గుతోంది. వైసిపికి చెందిన పలువురు కార్పొరేటర్లు ఇప్పటికే పార్టీని వీడి టిడిపిలో చేరుతున్నారు. తాజాగా శనివారం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నేతృత్వంలో 40, 31వ డివిజన్ల కార్పొరేటర్లు వై.సాంబిరెడ్డి, అందుగుల సంతోష్ టిడిపి కండువా కప్పుకున్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని ఎంపి కార్యాలయంలో ఎమ్మెల్యేలు గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు ఇద్దరు కార్పొరేటర్లకు టిడిపి కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. గళ్ళా మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఈ ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలకు చోటు లేదన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. వైసిపి కార్పొరేటర్లు తెలుగుదేశం చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లా డుతూ 'గుంటూరు కమిషనర్ ఒంటరివారు కాదని ఆయన వెనుక టిడిపి ఎమ్మెల్యేలంతా ఉన్నామని తెలిపారు. మేయర్ తాను చెప్పినట్టు చేయాలని హుకుం జారీ చేస్తున్నారని ఇది ఏమాత్రం సమంజసం కాదన్నారు. వైసిపి నాయకులు చెప్పినట్టు కమిషనర్ వినకపోవడంతో నిరాధార ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని కానీ అభివృద్ధిలో రాజకీయాలుచేయడం ఏమిటి!' అని ప్రశ్నించారు. కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, మానం శ్రీనివాస్, కొర్రపాటి నాగేశ్వరరావు, దాసరి రమణ, పలకలూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వైసిని కార్పొరేటర్లు



సమస్యల నిలయాలు.. దళితుల కాలనీలు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని బేతపూడి మాదిగ సామాజిక తరగతికి చెందిన చైతన్య నగర్, బేతపూడి గుండాలపాడు, మాలదాసులు కాలనీ మూడు కాలనీలలో వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. సర్వేలో పలు సమస్యలను బృందానికి కాలనీ వాసులు తెలిపారు. ఒక్కో కాలనీలో దాదాపు వంద కుటుంబాలు నివాసముంటున్నారని నాయకులు తెలిపారు. సిసిరోడ్లు, డ్రైనేజీ సమస్య, మంచినీటి సమస్య, విద్యుత్‌స్థంబాలు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు ఉన్నాయని బృందం సభ్యులకు స్థానికులు తెలిపారు. బేతపూడి గ్రామంలో సర్వే నంబరు 2 08 లో ఆరుఎకరాల పంట భూమి ఆరు తరాల నుండి దళితులు పండించుకుంటున్నటువంటి భూమిని 2001 సంవత్సరంలో చెరువు కోసం త్రవ్వి చట్టు బండలు పడడంతో వదిలేశారన్నారు. ఈ భూమిలో పిచ్చి చెట్లు జమ్ము విపరీతంగా ఉండటం వల్ల దీనిని బహిర్భూమిగా ఉపయోగించడం వల్ల మాలదాసులకు కాలనీల మధ్యలో ఉండటంవల్ల స్థానిక ప్రజలు అనేక రోగాలకు గురి అవుతున్నారని తెలిపారు. గుండాలపాడు మాలదాసులు కాలనీలో ఇచ్చిన 65 ఇళ్ల స్థలాలకు ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదని ఎన్నిసార్లు ప్రభుత్వానికి చెప్పుకున్న ఫలితం లేదని , ఉపాధి పనులు సంవత్సరంలో 30 రోజులు మాత్రమే చూపిస్తున్నారని అది కూడా ఐదు వారాలకు ఒకసారి డబ్బులు పడుతున్నాయని తెలిపారు. దళితుల యొక్క సమస్యలను ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మరియు సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి ప్రభుత్వాన్ని కోరారు



రైతు సంఘం ఆధ్వర్యంలో సర్వే

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సొసైటి భూములకు పట్టాలు, పాసు పుస్తకాలు లేవని, సిసిఆర్‌సి కార్డులు 80 మందికి ఉన్నప్పటికీ బ్యాకు రుణాల ఊసే లేదని గుడివాడ దళితులు రైతు సంఘం నాయకులకు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం తెనాలి డివిజన్ కమిటి ఆధ్యర్వంలో శనివారం దళితవాడలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ము శివ సాంబిరెడ్డి సర్వే నిర్వహించారు. హాఫ్ పేట సొసైటిలో గుడివాడ దళితులకు 40 ఎకరాల భూమి ఉన్నాకానీ, ప్రభుత్వం పట్టాలు, పాస్ పుస్తకాలు ఇవ్వలేదని చెప్పారు. రెండు పల్లెల్లో 150 మంది కౌలు రైతులలో 80 మందికి కార్డులు ఉన్నాగానీ బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడి, పరిహారాలు నోచుకోలేదని తెలిపారు. ప్రస్తుతానికి మార్కెట్లు ధాన్యం కౌలు 22 నుంచి 25 బస్తాలు, నగదు కౌలు రూ. 35 నుంచి 40 వేలు ఉందన్నారు. గత ప్రభుత్వం సొసైటి భూములకు రూ.7.5 వేలు ఇచ్చిందని, ఈ ప్రభుత్వం పరిహారం ఎప్పుడు ఇస్తుందా అని ఎదురు చూస్తున్నామన్నారు. ప్రస్తుతమున్న శ్మశానవాటిక స్థలం నిండిపోయిందని, మరికొంత స్థలాన్ని మంజూరు చేయాల్సిన ఆవస్యకత ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో మంత్రి మనోహర్ హయాంలో నిర్మించిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉందన్నారు. మంచినీటి కోసం అవస్థలు పడుతున్నామన్నారు.కృష్ణా జలాలు కోసం ఎదురు చేస్తున్నట్లు తెలిపారు. డ్రైయినేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో దోమలు ఎక్కువయ్యాయన్నారు. కార్యక్రమంలో ముద్దన సాంబశివరావు, జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్, ఇస్మాయిల్, దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.రవి

రాజధాని అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వమే నిధులివ్వాలి

సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఏపీ రాజధాని అభివృద్ధికి విభజన హామీ చట్టంలో పేర్కొన్న విధంగా కేంద్ర ప్రభుత్వమే నిధులను గ్రాంటుగా ఇవ్వాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి డిమాండ్ చేశారు. శనివారం ఉండవల్లిలో టీ బక్కిరెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ విస్తృత సమావేశంలో రవి మాట్లాడారు. రాజధానిఅమరావతికి పటిష్టమైన చట్టబద్ధత కల్పించాలని, ప్రజల ఉపాధి కల్పనకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను రూపొందించి, వారికి ఇచ్చిన హామీలన్నీ అమలు జరపాలని కోరారు. రాజధాని లో రైతులకు ఇచ్చిన ప్లాట్లపై బ్యాంకులు రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.రాజధానిలో నిర్మించిన టీట్కో గృహాల లబ్ధిదారుల బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని అన్నారు. రాజధాని రైతులు, మహిళలు, కార్మికులపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు అన్నిటిని ఎత్తివేయాలని , రాజధాని గ్రామాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, అసెంబ్లీ, హైకోర్టులో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికుల కు జీతాలు పెంచాలని కోరారు. వీరికి గత ప్రభుత్వం నిలిపివేసిన రాజధాని సామాజిక పెన్షన్లను పునరుద్ధరించాలని కోరారు. ప్రజలకు పెను భారంగా మారిన పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈసమావేశంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం భాగ్యరాజు, జే నవీన్ ప్రకాష్, కుంభ ఆంజనేయులు, వల్లభాపురం వెంకటేశ్వరరావు,షేక్ జానీ, అత్తలూరి వీర వెంకయ్య, గైరబోయిన నాగేశ్వరరావు, పార్వతి ఎస్ కే ఖాదర్ బాబా పాల్గొన్నారు.



పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుని గెలిపించుకుందాం

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ మరియు వివిధ ప్రజా సంఘాలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావుని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కళాధర్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన పెదకాకానిలోని సుందరయ్య కాలనీలో పలు సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ తరపు కార్యకర్తలకి లబ్ధి చేసున్నారని అధికారంలో ఉన్న లేకపోయినా ఉద్యోగ ఉపాధ్యాయ అధ్యాపక పెన్షనర్లు నిరుద్యోగ కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పోరాడి వారి సమస్యలను పరిష్కరించిన వ్యక్తి కె ఎస్ లక్ష్మణరావు అని అన్నారు. పొన్నూరు నియోజకవర్గం సిఐటియు కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ అధికార ధన బలానికి లొంగకుండా ప్రజాబలం ఉన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావుని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రంగారావు బాజీ బాబు గంగాధర్ నరసింహారావు పాల్గొన్నారు.

తెనాలి డిఎస్‌పికి ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి



రిపబ్లిక్ డే సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఉద్యోగులకు అందించే ఉత్తమ సేవా పుర స్కారాల్లో భాగంగా తెనాలి సబ్ డివిజనల్ పోలీసు అధికారి బి.జనార్ధనరావు ఉత్తమ సేవా పురస్కారాన్ని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ చేతులు మీదుగా శనివారం అందుకున్నారు. శాఖాపరంగా ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచినందుకు పురస్కారం లభించినట్లు డిఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా సిఐలు, ఎస్సైలు, ఆయనను అభినందించారు.

గ్రామీణ ఎస్సైగా రవిబాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మాచర్ల రూరల్ ఎస్సైగా పోపూరి రవిబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పని చేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాచర్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణకు గట్టి చర్యలు చేపడతానని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు మద్యం, మాంసం విక్రయాలు నిషేధం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం నరసరావుపేట పట్టణ పరిసర ప్రాంతాలలో మాంసం, మద్యం విక్రయాలు నిషేధమని.. ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. జంతు వధశాలలు, మాంసం, చికెన్, చేపల హోల్ సేల్, రిటైల్ వ్యాపారులు, మాంసాహార హొటల్స్, బార్, రెస్టారెంట్స్, వైన్స్ షాపులలో క్రయ, విక్రయాలు పూర్తిగా నిలుపుదల చేయాలని స్పష్టం చేశారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి-నకరికల్లు

నకరికల్లులోని గ్రోమోర్ సెంటర్‌ను మండల వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు శనివారం తనిఖీ నిర్వహించారు. ఎరువుల స్టాక్ నిలువలు, బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రెండు ఎరువుల నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు పంపించారు. ఈ సందర్భంగా దేవదాసు మాట్లాడుతూ మండలంలోని ఎరువుల డీలర్లు ఎమ్మార్పీకి మించి అమ్మితే చట్టపరంగా దుకాణదారునిపై 1985 ఎఫ్ సి ఓ ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు : జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

భారత రాజ్యాంగంలో ఆమోదం పొంది, అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఇకనైనా ఆ స్ఫూర్తి ఇంటింటికీ చేరాల్సిన సమయం ఆసన్నమైందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శనివారం ఓ ప్రకటనలో వినుకొండ నియోజకవర్గం, రాష్ట్ర ప్రజలు అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకూ సమాన హక్కులు లభించి, అందరూ సమానంగా జీవించాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు మాస్‌డ్రిల్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక నారాయణ స్కూల్లో రిపబ్లిక్ డే సందర్భంగా శనివారం ఈ-కిడ్స్ పిల్లలకు మాస్ డ్రిల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శేషగిరి మాట్లాడుతూ మాస్ డ్రిల్ వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని చెప్పారు.

అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను శనివారం మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్ తనిఖీ నిర్వహించారు. భోజన సదుపాయాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి లోపాలున్నా తమకు తెలియజేయాలని కోరారు. క్యాంటీన్ అంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి అన్నారు. భోజనం వడ్డించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పట్టణంలోని పిలుట్ల రోడ్డు, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు ఫాగ్ స్ప్రే చేయించారు.

రీసర్వేతో ప్రయోజనాలు

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

మండలంలోని జానపాడు గ్రామంలో శనివారం తహసీల్దార్ మధుబాబు రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. రీసర్వేను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి పూర్తి వివరాలు అందించి, అధికారులకు సహకరించాలని సూచించారు. రీ సర్వే ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

ఓటరు చేతిలోనే దేశ భవిష్యత్తు



ప్రజాశక్తి- మాచర్ల

దేశ భవిష్యత్తు ఓటరు చేతిలోనే ఉందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు పిలుపునిచ్చారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవ హారంగా ఏర్పడ్డారు.

పెదకూరపాడు : ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. కళాశాల విద్యార్థినులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు డానియేలు, రెవెన్యూ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదకూరపాడు : మండలంలోని 75త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా స్థాయిలో జరిగిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచి కలెక్టర్ పి.అరుణ్‌బాబు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. వివిధ విభాగాల్లో అక్షయ, జె.బ్లెస్సీ, కె.హేమంత్ సాయి రెడ్డి, అశోక్‌రెడ్డి, కె.దివ్యశ్రీ గెలుపొందారు.

రాజుపాలెం : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని మండల తహసీల్దార్ నెమలిపురి దుర్గేశ్వరరావు అన్నారు. విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ విస్తరణ అధికారి పగడాల ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్ : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సత్తెనపల్లి ఆర్డీవో జి.రమాకాంతరెడ్డి విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఓటు ఆవశ్యకతపై ప్రజలకు వివరించారు. అనంతరం తాలూకా సెంటర్లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. కొత్త ఓటర్లకు ఎపిక్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షమీ, తహసీల్దార్ కె.ఎస్.చక్రవర్తి, పట్టణ ఎస్ఐ సంధ్యారాణి పాల్గొన్నారు.

ఈపూరు : ఓటు మనందరి బాధ్యతని తహసీల్దార్ ఎ.నళిని అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఓటు ప్రాధాన్యం చెబుతూ నినాదాలు చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డిబేట్, వ్యాసరచన, క్విజ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్‌తోపాటు, ఎంఈఓ రామతులసి,















జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పలు మండలాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఆ చిత్రాలు..

ప్రధానోపాధ్యాయులు ఎన్.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట : ఓటర్ల దినోత్సవంలో భాగంగా స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి గడియాస్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమములో చిలకలూరిపేట మండల తహసీల్దారు షేక్ మహమ్మద్ హుస్సేన్, పురపాలక సంఘ కమిషనర్ పి.శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి : మండలంలోని గ్రామాలపాడు శివారులోని ఆంధ్ర సిమెంట్ లిమిటెడ్ సాగర్ గ్రూప్స్ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్లాంట్ హెడ్ సుబ్బారావు, హెచ్ఓడిలు శంకర్ నారాయణరెడ్డి, పరమేష్, నాగభూషణం, రామకృష్ణ, నరసింహులు, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ ఓటర్లను సన్మానించారు. పట్టణంలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట అప్పారావు, శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి : మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఓటరు దినోత్సవాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ముప్పాళ్ల : స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ముప్పాళ్ల వరకు మండలాధికారులు, సిబ్బంది, హైస్కూల్ విద్యార్థులతో ఓటరు చైతన్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు ఆవశ్యకతను తహసీల్దార్ భవానీ శంకర్ వివరించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు.

పిడుగురాళ్ల: ఓటు హక్కుతో మన భవిష్యత్‌ను మార్చుకోవచ్చునని పిడుగురాళ్ల తహసీల్దార్ మధుబాబు అన్నారు. మండలంలోని జానపాడు గ్రామంలో ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్లకు సన్మానించారు.

విజయపురిసౌత్ : విజయపురిసౌత్‌లోని బాలయోగి గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ మేరీమంజుల ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశు పోషకులకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి-పెదకూరపాడు

జీవాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, పశు పోషకులకు అండగా నిలుస్తోందని పశు సంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ దామోదర్ నాయుడు అన్నారు. శనివారం పెదకూరపాడులో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశువుల దాణా కోసం సబ్సిడీ, గోకులం షెడ్లు వంటి ఎన్నో పథకాలు అందిస్తున్నామన్నారు. వీటిని ఉపయోగించుకొని రైతులు పశు సంతతిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సకాలంలో రుణాలు తీసుకొని చెల్లించే వారికి గొర్రెలు, బర్రెలు, ఇతర పశువుల కోసం పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేయడానికి బ్యాంకర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. తొలుత లేగ దూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వాటిల్లో విభాగాల వారీగా ఎంపిక చేసి రైతులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కాంతారావు, పెదకూరపాడు ఏడీహెచ్ సారథి, టిడిపి మండల అధ్యక్షులు రమేష్, మాజీ ఎంపీపీ బాబూరావు, మాజీ యార్డు ఛైర్మన్ బెల్లంకొండ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడు: జగ్గాపురం పశువైద్యశాల పరిధిలోని



వైద్యశిబిరంలో పశువులను తనిఖీ చేస్తున్న పశు సంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ దామోదర్‌నాయుడు

సందెపూడి, గణేష్నివారిపాలెంల్లో డాక్టర్ పి. కిరణ్మయి ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 126 దూడలకు నట్టల నివారణ మందులు, 26 పశువులకు గర్భకోశ వ్యాధికోశ వ్యాధులకు చికిత్సలు, 21 పశువులకు చూడు పరీక్షలు, 19 సాధారణ చికిత్సలు చేశారు.

బెల్లంకొండ : చంద్రాజుపాలెంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. 441 పశువులకు పరీక్షలు చేశారు. పశు పోషకులకు అండగా నిలవాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం శిబిరాలు నిర్వహిస్తోందని వైద్యాధికారులు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఈపూరు

చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరమని వినుకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మహతి అన్నారు. మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మహతి మాట్లాడుతూ న్యాయ సంబంధిత సమస్యలు ఏవైనా ఉంటే తెలియజేయాలని సూచించారు. వైద్య సేవలపై అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించిన, చేసిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఎస్ఐ ఎం.ఉమామహేశ్వర మాట్లాడుతూ ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. వివాదాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.



ఓటు విలువ తెలుసుకో..













ప్రజాశక్తి - తుళ్లూరు

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని, తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గుంటూరు జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ తేజ కోరారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని విఐటి యూనివర్సిటీలో శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాటల్లాడుతూ యువత, పట్టణాలలో విద్యావంతులు ఓటు హక్కును వినియోగించుకోవడం లేదని తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకొని దేశ ప్రగతికి దోహదపడాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వి కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్ : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకుని, ఆ హక్కును వినియోగించుకోవాలని కోరారు. తాడేపల్లిలో జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల ప్రాంగణం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత వివరిస్తూ నినాదాలు చేశారు. పట్టణంలోని కృష్ణుని గుడి వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన అనేక పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

పెదనందిపాడు : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పెదనందిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ పి.శంకర్ బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీటీ షేక్ కరిముల్లా, ఈవోపీఆర్డీ బి.వరూధిని, ఆర్ఐ సాహితీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: ఓటర్లను చైతన్యం కలిగించేందుకు ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఐ.సునీత తెలిపారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి, ఓటు హక్కు వినియోగించుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. గ్రామానికి చెందిన 92 ఏళ్ల సీనియర్ ఓటరు చింతమనేని అప్పమాంబను సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మహిళలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కొల్లిపర : ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని కొల్లిపర తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని మండలంలో నిర్వహించారు. మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శామ్యూల్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎఎన్‌యూ : ప్రజాస్వామ్యంలో ఓటు కీలకపాత్ర పోషిస్తుందని ఏఎన్‌యూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎలక్ట్రోలర్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఓటు ప్రాధాన్యాన్ని వివరిస్తూ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నుంచి వర్సిటీ ముఖద్వారం వరకు ర్యాలీ సాగింది.

మంగళగిరి: ఓటు హక్కుపై ప్రజలను చైతన్యం చేస్తూ వీజే డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ యువత ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డిసి శ్రీలక్ష్మి , కళాశాల ప్రిన్సిపల్ నాదెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నడింపాలెంలో ఈఎస్ఐ ఆసుపత్రి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలోని నడింపాలెంలో ఈఎస్ఐ ఆసుపత్రికి చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా ఎన్‌హెచ్ 16 పక్కన 6.35ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. త్వరలోనే దీనికి సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. నడింపాలెం సర్వే నంబరు 149/4ఏలో 21.61 ఎకరాల స్థలాన్ని ఆయుష్ ఆరోగ్య మందిర్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. శనివారం జేసీ భార్గవ్ తేజ్, తహసీల్దార్ కరుణ కుమార్ తదితరులు సదరు భూమిని పరిశీలించారు. ఈఎస్ఐ ఆసుపత్రికి కేటాయించిన భూమిని కూడా పరిశీలించారు.

28న విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-తెనాలి

కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసల్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 28న విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ సంస్థ ఈఈ వీవీ చిరంజీవి శనివారం తెలిపారు. స్థానిక చెంచుపేట ఎస్ఎల్ఎస్ కల్యాణమండపంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే సదస్సులో సిజిఆర్ఎస్ఐ చైర్మన్ జస్టిస్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్, సభ్యులు పాల్గొని విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై వినతుల స్వీకరణతోపాటు, అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

నేడు రాజ్యాంగ పరిరక్షణ-సవాళ్లు అంశంపై సదస్సు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

ఆంధ్రప్రదేశ్ ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా నాయకురాలు బూరుగ సరస్వతి రెండవ వర్ధంతి సందర్భంగా ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్ నగర్ సీఐటీయూ కార్యాలయం వద్ద రాజ్యాంగ పరిరక్షణ– సవాళ్లు అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, మహిళా సంఘం జిల్లా నాయకురాలు దొంతిరెడ్డి శ్రీనివాస్ పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు మాంసం విక్రయాలు నిషిద్ధం


ప్రజాశక్తి-మంగళగిరి

గణతంత్ర దినోత్సవం సందర్భంగా మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఆదివారం మాంసం, చేపల విక్రయాలు నిషేధించినట్లు కార్పొరేషన్ కమిషనర్ ఆలిం బాషా తెలిపారు. దుకాణాలతోపాటు, హోటళ్లు, రెస్టారెంట్లలోనూ మాంసం విక్రయించడం, వినియోగించడం చేయవద్దని సూచించారు.

వైసీపీకి నూకలు చెల్లినట్లే : డొక్కా

ప్రజాశక్తి - తుళ్లూరు

వైసీపీలో ఏ ఒక్క నాయకుడూ కొనసాగే పరిస్థితి లేదని, ఆ పార్టీకి నూకలు చెల్లినట్లేనని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ విమర్శించారు. శనివారం తుళ్లూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డితో అక్రమ ఆర్థిక లావాదేవీ లు, పలు కేసుల్లో సహచరుడిగా ఉన్న విజయసాయిరెడ్డి లాంటివ్యక్తే ఆ పార్టీలో ఉండలేక పోతున్నారంటే వారి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. టిడిపి, బిజెపి, జనసేన గేట్లు తెరిస్తే వైసిపిలో జగన్ మాత్రమే మిగులుతారని ఎద్దేవా చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డిని ఆంధ్రా శశికళగా అభివర్ణించారు. సజ్జల కనుసన్నల్లోనే వైసిపి నడుస్తోందని విమర్శించారు. జగన్ రాజకీయాలలో, కుటుంబ వ్యవహారాలలో బలహీనంగా ఉన్నారని తెలిపారు. సజ్జల వేధింపుల కారణంగానే విజయ సాయిరెడ్డి వైసిపి నుంచి నిష్క్రమించారని చెప్పారు. ఢిల్లీలో ఒక పండిట్ ముహూర్త బలంతో వైసిపి కనుమరుగవుతుందని విమర్శించారు.



జయలక్ష్మి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో హెల్త్ సూపర్వైజర్‌గా పని చేస్తూ నెల్లూరు జిల్లా మనుబోలుకు పీహెచ్‌ఎన్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న వెలగపూడి జయలక్ష్మిని వైద్యసిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో జయలక్ష్మి సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.అన్నపూర్ణ, డీఐవో శ్రవణ్‌బాబు, డాక్టర్ పి.అనూష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలకు చెందిన 8 మంది విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు గుంటూరుకు చెందిన సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.1,01,500 లు ఉపకార వేతనాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ యాజమన్యానికి కళాశాల ప్రిన్సిపాల్ జి.వీర రాఘవయ్య, ఇతర సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఐ వాసుకు యాంత్రిక సేవా పురస్కారం

ప్రజాశక్తి - తాడికొండ

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు కేంద్ర ప్రభుత్వం అందించే యాంత్రిక సేవ పురస్కారానికి తాడికొండ సీఐ కె.వాసు ఎంపికయ్యారు. 2022వ సంవత్సరానికి గానూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసిన ఆయన ప్రభావంతంగా పని చేసి, ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. గణతంత్ర వేడుకలు సందర్భంగా గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో పురస్కారాన్ని అందుకోనున్నారు.



కొనసాగిన ఏసీసీ కార్మికుల రిలేదీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్ : న్యాయబద్ధంగా కార్మికులకు రావాల్సిన నష్టపరిహారాన్ని అందజేయాలని ఏసీసీ కార్మిక పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసిసి కార్మికుల 53వ రోజు రిలే నిరాహార దీక్షలను ఏఐఎఫ్టియు నాయకులు ఆదినారాయణ, కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా ఏసీసీ కార్మికుల సమస్యను పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కోర్టులు ఇచ్చిన తీర్పులను కూడా అధికారులు, యాజమాన్యం అమలు చేయకేపోవడం దారుణమన్నారు. ఈ దీక్షలలో జోసెఫ్, డి.రమణ, సిహెచ్ పిచ్చయ్య, బి నవనీతం, ఎం.శారద కూర్చున్నారు.

బాలుర ఉర్దూపాఠశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి మంగళగిరి

ప్రభుత్వ బాలుర ఉర్దూ పాఠశాల పాత బస్టాండ్ లో శనివారం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో పి. లీలా మాధవ్ అనే విద్యార్థి చిత్రలేఖనంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. గుంటూరు కలెక్టర్ ఆఫీస్ శంకర్ హాల్‌లో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ద్వారా మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నాడు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు షేక్. దర్యావలీని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు , డిఆర్ఓ ,ఆర్డీవో పాల్గొన్నారు.



పశువులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-పెదనందిపాడు

మండలంలోని పరిటాలవారిపాలెంలో శనివారం వెటర్నరీ డాక్టర్ బి.స్వాతి విమల ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 32 దూడలకు నట్టల నివారణ మందు వేశామని చెప్పారు. ఎనిమిది పశువులకు చూడి పరీక్షలు, 18 గేదెలకు గర్భకోశ వ్యాధి పరీక్షలు చేసినట్లు తెలిపారు. పాడి రైతులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దొండపాడులో పశు ఆరోగ్య శిబిరం

తుళ్లూరు : మండలంలోని దొండపాడులో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. 98 పశువులకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. 300 నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. 397 కోళ్లకు పరీక్షలు జరిపి టీకాలు వేశారు. తుళ్లూరు పశువైద్యశాల సహాయ సంచాలకులు ఎ.మురళీకృష్ణ, పెదపరిమి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ శ్రీపతి రేణుకాదేవి,మాజీ ఎంపిటిసి మైనేని గిరిజ పాల్గొన్నారు.



నారాయణకు తుమ్మల సాహితీ పురస్కారం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు బీఎల్ నారాయణకు అభ్యుదయ రచయిత తుమ్మల వెంకటరామయ్య స్మారక సాహితీ పురస్కారాన్ని అందించనున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కనపర్తి బెన్హర్ చెప్పారు. స్థానిక గాంధీనగర్ సిపిఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న పురస్కారం ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

అంబేద్కర్ భవన్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఆంధ్రా క్రిస్టియన్ కాలేజి ఎదురుగా పురోగతిలో వున్న అంబేద్కర్ భవన్‌ను శనివారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఆర్‌డిఒ శ్రీనివాసరావుతో కలసి పరిశీలించారు. అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ఇంకా అవసరమయ్యే అంచనా వ్యయంపై ప్రణాళికా సిద్ధం చేయాలని ఏపిఈడబ్ల్యూఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.అనిల్ కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. గతంలో రూ.10 కోట్ల నిధుల విడుదలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.అనిల్‌కుమార్ కలెక్టర్‌కు తెలిపారు. అయితే ప్రతిపాదనలు పంపినప్పటి నుండి ప్రస్తుతానికి అంచనా సుమారుగా రూ.12 కోట్ల నిధులు అవసరం వుంటుందని వివరించారు. అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన నిధులపై అంచనాతో ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. అంబేద్కర్ భవన్ పరిశీలించిన వారిలో గుంటూరు పశ్చిమ తహశీల్దార్ వెంకటేశ్వర్లు , అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ చెంచులక్ష్మీ , షెడ్యూల్ కాస్ట్ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు పాల్గొన్నారు.



అంబేద్కర్ భవన్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన...

స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నేడు జరిగే 76వ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను శనివారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలసి పరిశీలించారు. పెరేడ్ గ్రౌండ్‌లోని డయాస్, స్టాల్స్, విఐపి గ్యాలరీ , స్టూడెంట్స్ గ్యాలరీ , పబ్లిక్ గ్యాలరీ , మీడియా గ్యాలరీలను పరిశీలించి సూచనలు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ జరుగుతున్న నేపద్యంలో గ్రౌండ్‌లో మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ షేక్ . ఖజావలి , ఆర్డీఓ కె. శ్రీనివాసరావు , జెడ్పి సిఇఓ జ్యోతిబసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ఎంపిడిఒలు కృషి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామాల అభివృద్ధికి ఎంపీడీవోలు నిరంతరం కృషి చేయాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పని చేయని వారి పట్ల చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా హెచ్చరించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జడ్పి సీఈఓఎన్ జ్యోతిబసు అధ్యక్షతన ఎంపీడీవోల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిబంధనలు తప్ప నిసరిగా పాటించాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ విషయంలో ఉల్లం ఘనలు జరుగుతున్నాయని, అటువంటి వాటిపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంపీడీవోలపై ఉందన్నారు. ఎవరైనా అన్యాక్రాంతానికి పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుండి జెడ్పీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ఎన్ని ఒత్తిడిలు వచ్చిన కాపాడుతు న్నామన్నారు. జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణకు ఒక కమిటీ ఏర్పాటు చేశామని, ఆ కమిటీలో ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, జడ్పీటీసీలు సభ్యులుగా ఉన్నారని చెప్పారు. జిల్లా కమిటీలో సీఈఓ కన్వీనర్, డివిజన్‌లో ఆర్డీవోలు, జడ్పిటిసిలు తన అధ్యక్షతన సభ్యులు ఉన్నారని తెలిపారు. దీని గురించి మండల స్థాయి కమిటీ సమావేశంలో ఎంతమంది సమావేశాలు నిర్వహించారో తెలపాలని కోరారు. ఒక మండలంలో కొన్ని అవకతవకలు జరిగినట్టు తన దృష్టికి వచ్చిందని, అటువంటి వాటిని ఉపేక్షించబోమని తెలిపారు. జిల్లా పరిషత్ ఆస్తులు, వ్యవసాయ వాణిజ్య భూములు, గెస్ట్ హౌస్లు షాపింగ్ కాంప్లెక్స్, పడవ రేవుల వేలం సకాలంలో నిర్వహించి ఆదాయ వనరులు పెంచుకో వాలన్నారు. బకాయిల విషయంలో ఎంపిడిఒలు బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో మూడు జిల్లాల ఎంపీడీవోలు, డిప్యూటీ సీఈవో సిహెచ్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

మానసిక, దేహ దారుఢ్యానికి క్రీడలు దోహదం : శాప్ చైర్మన్

ప్రజాశక్తి-గుంటూరు

క్రీడలు మానసిక, శారీరక ధారుఢ్యానికి దోహదం చేస్తాయని ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఎ.రవి నాయుడు అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో భాష్యం ప్రీమియర్ లీగ్‌లో భాగంగా స్థానిక జెకెసి కళాశాల మైదానంలో జరుగుతున్న సెమీఫైనల్స్ మ్యాచ్‌లను శనివారం శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు ప్రారంభించారు. తొలుత రవినాయుడు చేతులమీదుగా జ్యోతిప్రజ్వనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపు ణ్యాలను మెరుగుపరచేందుకు భాష్యం విద్యాసంస్థలు క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఎంతో శ్రమకోర్చి 720 క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించటం సాధారణ విషయం కాదన్నారు. చదువుతో పాటు వారు ఎంచుకున్న రంగాల్లో యువతను ప్రోత్సహిస్తే వారు భవిష్యత్‌లో ఉన్నత విజయాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. భాష్యం చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా భాష్యం విద్యాసంస్థలు పనిచేస్తున్నాయన్నారు. భాష్యం ప్రీమియర్ లీగ్ జెండా, భాష్యం జెండాలను ఆవిష్కరించి బెలూన్లను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం పోటీల్లో పాల్గొంటున్న జట్ల నుండి గౌరవ వందనం స్వీకరించారు. సరనరావుపేట నింజాస్ జట్టుతో వైజాగ్ వెలాసిటీ-3 జట్టు తలపడగా వైజాగ్ వెలాసిటీ-3 జట్టు విజయం సాధించింది. అలాగే వెస్ట్ గోదావరి వారియర్స్ జట్టుతో హైద్రాబాద్ హైలాండర్స్-2 జట్టు తలపడగా హైద్రాబాద్ హైలాండర్స్-2 జట్టు విజయం సాధించింది. పోటీల్లో గెలుపొందిన జట్లకు చైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

వేడెక్కిన గుంటూరు కార్పొరేషన్ రాజకీయం



రాష్ట్రంలోనే కీలకమైన గుంటూరు నగరపాలక సంస్థ రాజకీయం వాడీవేడిగా మారుతోంది. ఆధిపత్యం సాధించేందుకు టిడిపి వేగంగా పావులు కదుపుతోంది. గత వారం రోజుల్లో నలుగురు వైసిపి కార్పొరేటర్లను టిడిపికి అనుకూలంగా తిప్పుకొన్నారు. వీరిలో ఇద్దరు అధికారికంగా చేరగా మరో ఇద్దరు టిడిపికి తమ మద్దతు అని ప్రకటించారు. మరో ఆరుగురు వైసిపి కార్పొరేటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు టిడిపి వేగంగా పావులు కదుపుతోంది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, గళ్లా మాధవి ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 2020లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి 8 మంది, జనసేన నుంచి ఇద్దరు మాత్రమే గెలుపొందగా 46 మంది వైసిపి నుంచి, ఒకరు ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. గత ఎన్నికల ముందు 9 మంది వైసిపి కార్పొరేటర్లు టిడిపిలో చేరిపోయారు. అలాగే ఒక కార్పొరేటర్ మృతి కారణంగా జరిగిన ఉప ఎన్నికల్లో టిడిపి గెలుపొందింది. తరువాత మరో కార్పొరేటర్ టి.కృష్ణారెడ్డి మృతితో ఒక డివిజన్ ఖాళీగా ఉంది. అలాగే సార్వత్రిక ఎన్నికల తరువాత జనసేనలోకి నలుగురు, టిడిపిలోకి మరో ముగ్గురు చేరారు. దీంతో వైసిపి బలం 30కి తగ్గిపోయింది. ప్రస్తుతం టిడిపి కూటమి బలం 26కి చేరింది. ఫిబ్రవరి 3వ తేదీన జరగనున్న స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు టిడిపి వేగంగా పావులు కదుపుతోంది. స్టాండింగ్ కమిటీ ఎన్నికలను టిడిపి, వైసిపి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఆధిపత్యం సాధించిన తరువాత మార్చిలో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు టిడిపి చురుగ్గా వ్యూహరచన చేస్తోంది. కార్పొరేషన్‌లో స్టాండింగ్ కమిటీ ఎన్నికల కోసం కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు రంగంలోకి దిగారు. వైసిపికి చెందిన 10 మంది కార్పొరేటర్లతో చర్చలు జరుపుతున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు వీరి మద్దతు కూడగడుతున్నారు. ఇప్పటికే గత వారం రోజులుగా నలుగురు మద్దతు కూడగట్టారు. దీంతో అప్రమత్తం అయిన వైసిపి నేతలు కూడా గతంలో టిడిపి వైపునకు వెళ్లిన వారితో అంతర్గ తంగా చర్చలు ప్రారంభించారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలను ఎలా ఎదుర్కొవా లన్న అంశంపై మల్లగుల్లాలు పడుతూ టిడిపి, జనసేన కార్పొరేటర్లతో చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. స్టాండింగ్ కమిటీ మొత్తాన్ని కైవసం చేసుకోవాలని టిడిపి వ్యూవహచన చేస్తుండగా వారి ఎత్తులకు పై ఎత్తులు వేయడానికి వైసిపి కూడా పావులు కదుపుతోంది. స్టాండింగ్ కమిటీ ఎన్నికల తరువాత మేయర్, డిప్యూటీ మేయర్లను కొత్తవారిని ఎన్నుకుంటామని టిడిపి కార్పొరేటర్లు విశ్వాసం వ్యక్తం చేస్తుండగా టిడిపి ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నట్టు వైసిపి వర్గాలు తెలిపాయి. నిబంధనల ప్రకారం మార్చి 18 తరువాత మేయర్‌పై అవిశ్వాసం కోసం టిడిపి నాయకులు వ్యూహరచన చేస్తున్నారు. టిడిపిని దీటుగా ఎదుర్కొంనేందుకు వైసిపి కూడా కార్పొరేటర్లను కాపాడుకునేందుకు తాయిలాలు ప్రకటిస్తున్నట్టు తెలుస్తోంది. (ఎ.వి.డి.శర్మ)

ఆర్‌విఆర్‌ను సందర్శించిన టిసిఎస్ బృందం

ప్రజాశక్తి-గుంటూరు

కంపెనీల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటూ విద్యార్థులు పరిశోధనలవైపు దృష్టి సారించాలని టిసిఎస్ వైస్‌ప్రెసిడెంట్, టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ 4.0 బిజినెస్ యూనిట్ హెడ్ జయరామకృష్ణ నూతలపాటి అన్నారు. టిసిఎస్ ఉన్నతాధికారుల బృందం శనివారం ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిని సందర్శించింది. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యా వసతి సౌకర్యాలను, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను, కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంకుబేషన్ సెంటర్‌ను పరిశలించారు. విద్యార్థుల ఆలోచనలతో ఇంకుబేషన్ సెంటర్‌లోని అత్యాధునికి యంత్ర సామాగ్రి ద్వారా తయారవుతున్న ఉత్పత్తులను పరిశీలించి, నూతన ఆవిష్కరణలు చేస్తున్న విద్యార్థులను అబినందించారు. అనంతరం విద్యార్థులతో చర్చాగోష్టి నిర్వహించారు. జయరామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత ఇండస్ట్రీ 4.0 దిశగా పారిశ్రామిక ప్రక్రియ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మిళితమై ఉందని, విఎల్ఎస్ఐ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, క్లౌడ్ కంప్యూటింగ్, అదునాతన రోబోటిక్స్ దిశగా సాంకేతిక పురోగతి సాధించుకుందని చెప్పారు. టెక్నాలజిలోనే కాకుండా టాటాలోని వివిధ అనుబంధ సంస్థలు ఉత్పత్తులు, వ్యాపార రంగాల్లో ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలిచి మన్ననలు పొందుతున్నాయని చెప్పారు. తమ వ్యాపార కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయంలో అధికభాగం విద్యా, వైద్యం రంగంలో సేవా కార్యక్రమాల కోసం వినియోగించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాలేజి సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, టిసిఎస్ హైదరాబాద్ జనరల్ మేనేజర్ హెచ్‌ఆర్ శ్రీకాంత్ సూరంపూడి, చాట్రగడ్డ, కళాశాల ప్రిన్సిపాల డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న టిసిఎస్ వైస్‌ప్రెసిడెంట్ జయరామకృష్ణ

ఎఎన్‌యు పోటీల్లో టిజెపిఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన క్విజ్, వక్తృత్వ పోటీల్లో టిజెపిఎస్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి అన్నారు. బండ్లమూడి హనుమాయమ్మ కాలేజిలో నిర్వహించిన ఈ పోటీల్లో వక్తృత్వంలో మొదటి స్థానం, క్విజ్‌లో తృతీయ స్థానం తమ కాలేజి విద్యార్థులు సాధించారన్నారు. పోటీల్లో ప్రతిభ చూపి విద్యార్థులు కె.అంజలి, మేరి, నందినికి కాలేజి అధ్యక్షులు పోలిశెట్టి శ్యాంసుందర్, సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం కమిటీ సభ్యులు నాగసుందరం అభినందనలు తెలియచేశారు. కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర విభాగాదిపతి జి.సురేష్‌కుమార్, గుంటూరు జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్, ఆర్.జయ శైలజ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కాలేజి సెక్రెటరీ, ప్రిన్సిపాల్ తదితరులు

ఎంపిడిఒల సంఘం అధ్యక్షులుగా బండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా అడహక్ కమిటీ అధ్యక్షులుగా బండి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపిడిఒల సంఘం సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశంలో రోజువారీ విధి నిర్వహణలో ఎంపిడిఒలు ఎదుర్కొంటున్న సమస్యలు, పంచాయితీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పరిపాలనా సంస్కరణలు, తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలో వివిధ విభాగాలకు సంబంధించిన పనుల పర్యవేక్షణకు ఎంపిడిఒలను బాధ్యతలను చేయటం వల్ల పనిభారం ఎక్కువగా ఉందని, దీని వల్ల పంచాయితీరాజ్‌కు సంబంధించిన ముఖ్య విషయాలపై దృష్టి సారించటం సాధ్యం కావట్లేదని, తద్వారా మండల పరిపాలనకు ఆటంకం ఏర్పడుతుందని పలువురు ఎంపిడిఒలు సమావేశంలో పేర్కొన్నారు. ఎంపిడిఒల సమస్యల పరిష్కారానికి రానున్న కాలంలో సంఘాన్ని బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా సంఘం రెగ్యులర్ కమిటీ ఎన్నికలు జరిగే వరకూ అడహక్ కమిటీని పనిచేస్తుందని నాయకులు తెలిపారు. అధ్యక్షులుగా బండి శ్రీనివాసరావుతోపాటు, సభ్యులుగా జి.వి.సత్యనారాయణ, పి.బాబురావు, ఆర్‌ఇవి ఫణికుమార్ నాయక్, ఎ.దీప్తి, ఎన్.నాగలక్ష్మి, ఆర్.శ్రీనివాసరావు, పి.సీతారామయ్య, జి.సమతావాణి, ఎ.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ గజిటెడ్ ఆఫీసర్స్ సంఘం కో కన్వీనర్, జెడ్పీ సిఇఒ జ్యోతిబసు సమావేశానికి పరిశీలకులుగా హాజరయ్యారు.



సంఘం అడహక్ కమిటీ నూతన కార్యవర్గం